క్లుప్తంగా

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరాలు

సంగెం : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నేడు (శనివారం), ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తామని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు రెండు కలర్ ఫొటోలు, ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌లు జత చేసి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

పరామర్శ



దుగ్గొండి: మండలంలోని బంధంపల్లికి చెందిన పోరెడ్డి వీరారెడ్డి 10 రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుడి కొడుకులైన రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబరెడ్డిలను ఓదార్చారు. ఆయన వెంట నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, నాయకులు యరాం, కొల్లూరి రాజు, నరిగె ప్రవీణ్‌కుమార్, బొమ్మినేని భరత్‌రెడ్డి, సుకినె నాగరాజు, అమ్మ రోహిత్, నర్సింహారెడ్డి, గాదం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



సంగెం: మండలంలోని కాపులకనిపర్తి గ్రామానికి చెందిన వెలిశాల రమేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి హనుమాన్ రజక పరపతి సంఘం నుంచి రజక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకట్రాజం, గౌరవ అధ్యక్షుడు మోహన్, నాయకులు రాములు, సారంగపాణి, శంకర్, కుమారస్వామి, ఎల్లయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో..

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల చేరాలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి శ్రీ పార్వతి పరమేశ్వర పరపతి సంఘం నుంచి రూ.5 వేల సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, సదానందం, ప్రశాంత్, రమేశ్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహిళా సంఘం ఎన్నిక

రాయపర్తి: మండలంలోని సన్నూరు గ్రామంలో ముదిరాజ్ మహిళా సంఘం సొసైటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మత్స్యశాఖ జిల్లా సహకార అధికారి (డీసీఓ) విమల శుక్రవారం తెలిపారు. అధ్యక్షురాలిగా కాయిత శోభ, ఉపాధ్యక్షురాలిగా గూబ స్వప్న, కార్యదర్శిగా గూబ జ్యోతి, డైరెక్టర్లుగా గూబ సుహాసిని, కాయిత యాకమ్మ, గూబ స్వరూప, లచ్చమ్మ, సమ్మక్క, రమ తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సంగెం: మండలంలోని కోట వెంకటాపురంలోని కాకతీయుల కాలం నాటి కోట కట్టను, హరితహారంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఎలమకంటి శ్రీనివాస్, బాషిపాక దేవదానం జేసీబీతో కట్టను, మొక్కలను ధ్వంసం చేసి చదును చేశారని తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో టి.వేణు, తాళ్లపెల్లి శ్రీనివాస్, బాల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

దామెర : మండల కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని స్థానిక సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి కోరారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గూడూరు : మండలంలోని గూడూరు, తీగలవేణి జీపీ పరిధిలోని సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రణీత్ తెలిపారు. ఆ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి

వర్ధన్నపేట: సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ఇల్లందలో సర్పంచ్ సుంకరి సాంబయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25 సభకు ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి దోహదపడే 9 అంశాల్లో రెండింటిని ఎంపిక చేసుకుని వాటికి బృందాలను ఏర్పాటు చేసుకుని ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, హెల్తీ పంచాయతీ అంశాలను గ్రామ సభ తీర్మానంతో ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఆ రెండు అంశాలకు సంబంధించి బృందాలను నియమించి ప్రణాళిక రూపొందించి నివేదిక అందజేయాలని చెప్పారు. ఈ రెండు అంశాలను తీసుకుని గ్రామ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. సర్పంచ్ సుంకరి సాంబయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమం (జీపీడీపీ)పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపసర్పంచ్ మడ్డి రాజ్‌కుమార్, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, పిట్టల జ్యోతి రమేశ్, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

ప్రభుత్వ నిధులు, పన్నులతో పనులు

చెన్నారావుపేట: గ్రామ పంచాయతీకి ప్రభుత్వ నిధులు, ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సూపరింటెండెంటెంట్ దయాకర్, ఏపీఓ అరుణ చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు, వసూలయ్యే పన్నులు పరిశీలించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.



చెన్నారావుపేట:మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి

17 గ్రామాల్లో జీపీడీపీ సభలు

దుగ్గొండి: మండలంలోని అడవి రంగాపురం, బంధంపల్లి, బిక్కాజిపల్లి, బొబ్బరోనిపల్లి, చలపర్తి, చంద్రయ్యపల్లి, చాపలబండ, దేశాయిపల్లి, దుగ్గొండి, గిర్నిబావి, గొల్లపల్లి, గుడ్డెలుగులపల్లి, గుడిమహేశ్వరం, కేశవాపురం, లక్ష్మీపురం, మదిర మందపల్లి, మహ్మదాపురం గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన సభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండి: మాట్లాడుతున్న సర్పంచ్ శారద

పథకాల వినియోగం కీలకం



నల్లబెల్లి: మాట్లాడుతున్న మేనేజర్ జనార్దన్



చెన్నారావుపేట : మాట్లాడుతున్న అధికారులు

నల్లబెల్లి: దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు వినియోగించుకోవాలని ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ జనార్దన్ తెలిపారు. వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండల కేంద్రంలో ఆ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలు, యువత, మహిళలు, రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రధాన మంత్రి ఫసల్ యోజన, కృషి సంచాయ్ యోజన, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, ముద్ర రుణాలు, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య బీమా, ఆవాస్ యోజన, పీఎం కిసాన్, ఉజ్వల గ్యాస్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ముద్రించిన క్యాలండర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, ఎంపీటీసీ జన్ను జయరావు, నల్లబెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆచార్య, ఏపీఎం సునీత, ఈఓ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, జ్యోతి భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ అల్లం శౌరెడ్డి, ఏబీపీఎం ఆకుల రూప్‌సాగర్, ఏఎన్‌ఎం మాధవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

చెన్నారావుపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌లాల్, ఎంపీడీఓ భారతి తెలిపారు. మండలంలోని గొల్లభామతండా, గొల్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. సబ్సిడీ పరికరాలు, తదితరాలపై ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు రమేశ్, ఏపీఓ ముక్కెర ఈశ్వర్, యూనియన్ బ్యాంకు కోఆర్డినేటర్ కల్యాణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, సీసీ శ్రీలత పాల్గొన్నారు.

కొండేటి శ్రీధర్ నియామకంపై హర్షం



మాట్లాడుతున్న రాజు, కుమారస్వామి

వర్ధన్నపేట: స్థానిక మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ను బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంతో ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో శుక్రవారం బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి మాట్లాడారు. శ్రీధర్ పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా చేసిన సేవలను గుర్తించి ఆయన్ను ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి సత్యం, గిరిప్రసాద్, దేవేందర్‌రావు, సందీప్, మల్లెపాక అనిల్, పెద్దూరి రాజ్‌కుమార్, కామ రవి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగగిరి జాతర హుండీ లెక్కింపు

చెన్నారావుపేట: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని లింగగిరిగుట్టపై 4 రోజులపాటు నిర్వహించిన జాతర నేపథ్యంలో హుండీ కానుకలను సర్పంచ్ మాదారపు భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఉపసర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలోని కానుకలను లెక్కించగా మొత్తం రూ.2 లక్షల 621 రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలం ద్వారా రూ.71 వేల 200లు, హుండీల ద్వారా రూ.1,29,421లు వచ్చినట్లు వివరించారు.



కానుకలను లెక్కిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

కార్యక్రమంలో వార్డు సభ్యులు చీకటి చిన్న రాజు, ప్రభాకర్, మల్లం సాగర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిలో నల్లా గేట్‌వాల్వ్

● అధికారుల నిర్లక్ష్యంపై విమర్శల వెల్లువ

నర్సంపేట రూరల్ : డ్రెయినేజీలోని మురుగునీటిలోనే నల్లా పైపులైన్ గేట్‌వాల్వ్ ఉండడంతో లీకేజీ ఏర్పడితే మురుగునీరే నల్లాల నుంచి సరఫరా చేసే అవకాశం ఉండడంతో ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలిలా.. మండలంలోని సర్వాపురం ప్రత్యేక గ్రామంగా ఉన్న సందర్భంలో పాకాల రోడ్డు, వడ్డెర కాలనీకి నీటి సరఫరా చేసే పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో పాకాల రోడ్డుకు, వడ్డెర కాలనీకి నల్లా నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. ఆ నేపథ్యంలో నాటి సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వడ్డెర కాలనీ కోసం ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. తదనంతరం పాకాల రోడ్డు సైడ్ ఉన్న కాలనీకి నీళ్లు వస్తున్నాయి. ఈ క్రమంలో పాకాల రోడ్డు కింద వైపు జనావాసాలు పెరగడంతో నల్లా కనెక్షన్ల సంఖ్య పెరిగింది. పాకాల రోడ్డు కింద భాగంలో వంపు ఉండడంతో నీరంతా కిందకే వెళ్తుండడంతో పైభాగంలో ఉన్న ఇళ్ల నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అప్పటికే సర్వాపురం నర్సంపేట మున్సిపాలిటీలో కలవడంతో అప్పటి కౌన్సిలర్ దారంగుల రజిత నగేశ్ ఆధ్వర్యంలో బ్యాంక్ సమీపంలో నల్లా పైపులైన్‌కు గేట్ వాల్వ్ ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని ఇళ్లకు నల్లా నీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా సైడ్ డ్రెయినేజీ నిర్మించగా ఆ నల్లా గేట్ వాల్వ్ డ్రెయినేజీ మధ్యలో ఉండిపోయింది. ఈ క్రమంలో మురుగు నీరు నల్లా పైపులైన్ గేట్‌వాల్వ్ చుట్టూ ప్రవహిస్తోంది. నల్లా గేట్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడితే మురుగునీరంతా నల్లా పైపులైన్‌లోకి వెళ్లి కలుషితమై ఇళ్లకు సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ మధ్యలో ఉన్న పైపులైన్‌కు ప్రత్యేక ఏర్పాటు చేయాలని లేదా డ్రెయినేజీ నీటిని గేట్ వాల్వ్ నుంచి కాకుండా మరో వైపు నుంచైనా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డ్రెయినేజీ మధ్యలో ఉన్న నల్లా గేట్‌వాల్వ్

ముగ్గురిపై కేసు నమోదు

ఐనవోలు : మండల కేంద్రంలో శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బహిరంగ ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవిస్తూ పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నల్లబెల్లి : ప్రజావ్యతిరేక మనువాద పాలకులు అవలంభిస్తున్న తప్పుడు విధానాలపై ఐక్యపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ కోరారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కార్యదర్శి దామ సాంబయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో కుమారస్వామి, రమేశ్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా పోరాటాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో నాయకులు నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, కన్నం వెంకన్న, జన్ను రమేశ్, మార్త నాగరాజు, కర్నె సాంబయ్య, నాగెల్లి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేల్చి.. ఒడిసెలతో రాళ్లు విసిరి

మొక్కజొన్న చేలను కాపాడుకుంటున్న రైతులు

- కోతులు పంటను ధ్వంసం చేయకుండా కాపలా
- జిల్లాలో 60 వేల ఎకరాల్లో సాగు

చెన్నారావుపేట : అతివృష్టి, అనావృష్టితోపాటు పంటలకు తెగుళ్లతో రైతులు ఎప్పుడూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. యాసంగిలోనైనా సమృద్ధిగా పంటలు పండించి అప్పులు తీర్చుకుందామని ఆశించిన వారికి కోతులతో కష్టాలు మొదలయ్యాయి. మొక్కజొన్న పంటపై వానర సైన్యం దాడులు చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఒక వైపు కొడితే మరో వైపు కోతుల గుంపు పంటను నష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. పంటను కాపాడుకోవడం కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించడం ఒక ఎత్తయితే.. దాన్ని కోతుల బారి నుంచి కాపాడుకోవడం మరో ఎత్తు. ప్రస్తుతం మొక్కజొన్న పంట పీచుతో గింజ దశకు చేరుకుంది. కానీ, పంటపై కోతులు దాడి చేస్తుండడంతో రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా చేల వద్దనే కాపలా ఉంటున్నారు. గుంపులుగా వస్తున్న కోతులు నిమిషాల్లో పంటను ధ్వంసం చేస్తున్నాయి. జిల్లాలోని కొందరు రైతులు చేల వద్ద సోలార్ కంచెలు, మైకులు ఏర్పాటు చేస్తున్నారు. కుక్కలను తిప్పుతూ కట్టేస్తున్నారు. బాణసంచా కాలుస్తూ బెదిరిపోయేలా చేస్తున్నారు. ఒడిసెల్లో రాళ్లు పెట్టి కొడుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు వలలు పెడుతున్నారు.



ఒడిసెలతో కోతులను కొడుతున్న రైతు శ్రీనివాస్



కర్ర, కుక్కతో కాపలా కాస్తున్న రైతు

చేను వద్దనే ఉంటున్నాం..



ఎకరం భూమిలో మొక్కజొన్న వేసిన. పంట వేసి నెల రోజులు దాటింది. కోతులు వస్తుండటంతో కాపాడుకునేందుకు చేను వద్దనే కాపలా ఉంటున్నాం. పంటలు పండించకపోతే బతుకు భారం అవుతుంది. పంట వేస్తే తెగుళ్లతో ఒక బాధ అయితే కోతులతో మరో బాధ ఉంది. ప్రభుత్వం వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

-పెంతల శ్రీనివాస్, రైతు

కోతులతో పంట ధ్వంసం..



కోతులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్నాయి. కుక్కలు, కర్రలతో తరిమినా బాంబులు, ఒడిసెలతో బెదిరించినా మళ్లీ వస్తున్నాయి. కంకులు వస్తున్న ప్రస్తుత సమయంలో కోతులు వాటిని తుంచుతూ భారీ నష్టాన్ని కలిగింపజేస్తున్నాయి. పంటను కాపాడుకోవడానికి చేను వద్దనే కాపలా కాస్తున్నాం.

-ధారావత్ సునీత, రైతు

60 వేలకు పైగా సాగు..

వరంగల్ జిల్లాలో రైతులు 60 వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట గింజ దశలో ఉంది. రామచిలకలు, మరోవైపు అడవి పందులు, కోతుల దాడితో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. గుట్టలున్న ప్రాంతంలో మొక్కజొన్న పంట వేయాలంటేనే భయపడుతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా వచ్చి కంకులను విరిచివేస్తున్నాయి. నిత్యం కాపలా ఉంటున్న రైతులపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నాయి. పంటలను కోతులను నుంచి కాపాడుకోవడానికి అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

ఐనవోలు : మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పున్నేలులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో యువత రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కత్తి దేవేందర్, నాయకులు రాయపురం సాంబయ్య, వాకిటి చందర్‌రెడ్డి, ఎండీ చాంద్‌పాషా, యువకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్వర్ణ

ముగిసిన లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



శావ నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గంపేట్‌లో శావతీశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు మంత్రోచ్చరణ నడమ శావతీయగా గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. సర్పంచ్ పురాణం రాజేశ్వరి ఈశ్వర్, ఎంపీటీసీ గండు రాము తదితరులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలి

ఆత్మకూరు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలని ఆత్మకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు టింగిలికారి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు వైద్య సూచనలు పాటించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్య సేవలను మెరుగుపర్చుతుందని అన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందిస్తామని ఏరుకొండ రజనిరవీందర్ గౌడ్ తెలిపారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఆఫీసర్ శ్రావణి, వైద్యులు నర్సింగరావు, ల్యాబ్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్లలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. పెండింగ్ చాలాన్లను చెల్లించాలన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తగూడ : పొగుళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. హెచ్‌ఎం విష్ణువర్ధన్, డీటీఎఫ్ నాయకులు పొట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి’

తొర్రూరు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. పార్లమెంట్, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పార్టీకి మంచి ఆదరణ ఉందని, ఆ ఊపును కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆశించిన అభివృద్ధి చేసి చూపుతానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైస్ ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, సర్పంచ్ కాటం మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.